# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

సోమవారం 9, ఫిబ్రవరి 2026


### బి.ఆర్.ఎస్, సీ.పి.ఐ పార్టీల అభ్యర్థులను

## భారీ మెజారిటీతో గెలిపించాలి: బాల్క

రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త



క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో బి.ఆర్.ఎస్ పార్టీ, సీ.పి.ఐ పార్టీలు బలపరిచిన అభ్యర్థులను భారీ మెజారిటీ తో గెలిపించాలని చెన్నూరు మాజీ శాసనసభ్యులు, బి.ఆర్.ఎస్ పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ కోరారు. ఆదివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా మున్సిపాలిటీలోని పలు వార్డులలో కారు గుర్తుకు, కంకి కొడవలి గుర్తు పై ఓటు వేసి గెలిపించాలని ఓట్లను అభర్థించారు. క్యాతన్‌పల్లి పురపాలక అభివృద్ధి బి.ఆర్.ఎస్ పార్టీతో మాత్రమే సాధ్యం అయిందని అన్నారు.



## నిర్మల్ ప్రగతి పథంలో

# అభిలాష అడుగులు



### సమగ్ర అభివృద్ధికి చిరునామాగా జిల్లా..

నిర్మల్ ప్రతినిధి, ఫిబ్రవరి 08, ప్రభాతవార్త:

**ఒక అధికారి సంకల్పం ఉంటే వెనుకబడిన ప్రాంతం కూడా అభివృద్ధికి నమూనాగా ఎలా మారుతుందో నిర్మల్ జిల్లా నిరూపిస్తోంది. 2018 బ్యాచ్ ఐఏఎస్ అధికారిణి అభిలాషా అభినవ్ నిర్మల్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆరోగ్యం, విద్య, జల సంరక్షణ, సాంస్కృతిక రంగాల్లో జిల్లా జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. కేవలం పరిపాలనకే పరిమితం కాకుండా, ప్రజల అవసరాలను గుర్తించి ఆమె చేపట్టిన వినూత్న కార్యక్రమాలపై ప్రత్యేక విశ్లేషణ.**



### మాతృత్వానికి భరోసా..

'అమ్మ రక్షి త' జిల్లాలో మాతృ మరణాల రేటును సున్నాకు చేర్చాలనే లక్ష్యంతో ప్రారంభించిన 'అమ్మ రక్షి త' కార్యక్రమం వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చింది. 2024 డిసెంబర్ నుంచి 2025 అక్టోబర్ వరకు 10,700 మందికి పైగా గర్భవతులను గుర్తించి, వారికి మొదటి త్రైమాసికం నుంచే పర్యవేక్షణ అందించారు. ముఖ్యంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో 100 కాన్పులు జరిగేలా చూడటంతో మాతృ మరణాలు గణనీయంగా తగ్గాయి. 2030 నాటికి నిర్మల్‌ను మాతృ మరణ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలనే కృతనిశ్చయంతో యంత్రాంగం పనిచేస్తోంది.

### భావి భారత పౌరులకు 'బాల్ శక్తి'..

నిర్మల్ జిల్లాలోని 45,000 మంది రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు 'బాల్ శక్తి' కార్యక్రమాన్ని రూపకల్పన చేశారు. కేవలం చదువుకే పరిమితం కాకుండా ఆరోగ్యం, ఆర్థిక అక్షరాస్యత, నైపుణ్యాభివృద్ధి, సామాజిక అవగాహన అనే నాలుగు ప్రధానాంశాలతో విద్యార్థులను సాధికారులుగా మార్చే ప్రయత్నం జరుగుతోంది. ఇ

2లో..

### ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా

## సమన్వయంతో కృషి చేయాలి

- **ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవాలి**
- **ఎన్నికల సాధారణ పరిశీలకులు అలోక్ కుమార్**

కాగజ్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త

2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కు తప్పనిసరిగా వినియోగించుకోవాలని ఎన్నికల సాధారణ పరిశీలకులు అలోక్ కుమార్ అన్నారు. ఆదివారం కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్‌నగర్ మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని సందర్శించి ఓటింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల సాధారణ పరిశీలకులు మాట్లాడుతూ 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని ఆసిఫాబాద్ మున్సిపల్ పరిధిలోని మిగతా 2లో..



## ఓటు హక్కు వజ్రాయుధం




*** ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

ఆదిలాబాద్, ఫిబ్రవరి 08, ప్రభాతవార్త:

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత శక్తివంతమైనదని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా తమ ఓటును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ఆదివారం (స్వీప్) ఓటరు చైతన్య కార్యక్రమంలో భాగంగా స్థానిక కేఆర్‌కె కాలనీలో భారీ ఓటరు అవగాహన ర్యాలీని నిర్వహించారు. అంతకుముందు కాలనీలో నిర్వహించిన అవగాహన ర్యాలీనీ ఆర్డీఓ స్రవంతి జెండా ఊపి ప్రారంభించి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత శక్తివంతమైనదని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా తమ ఓటును వినియోగించుకోవాలని అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచడమే లక్ష్యంగా ఓటరు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం కాలనీవాసులందరితో ఓటు హక్కు వినియోగంపై కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ స్రవంతి, డివైఎస్ఓ శ్రీనివాస్, డీపీఆర్ఓ విష్ణువర్ధన్, మెప్మా పిడి రాజు పాల్గొన్నారు. అలాగే తహసిల్దార్లు శ్రీనివాస్, గోవింద్, వేణుగోపాల్‌తో పాటు ఇతర జిల్లా అధికారులు, యువత, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# పోలింగ్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలి

**- మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్**

నస్పూర్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త




2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా ఈ నెల 11వ తేదీన జరుగనున్న పోలింగ్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ఆదివారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో మాస్టర్ ట్రైనర్ల ఆధ్వర్యంలో పిఓ, ఎపిఓలకు నిర్వహించిన శిక్ష ణకార్యక్రమానికి మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అన్వేష్ తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా పోలింగ్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో 800 ఓటర్లకు మించకుండా పోలింగ్ జరిగేలా ఏర్పాట్లు చేయడం జరిగిందని, ప్రతి పోలింగ్ కేంద్రంలో కేటాయించబడిన సిబ్బందికి పోలింగ్ ప్రక్రియలోని ప్రతి అంశం తెలిసి ఉండాలని, ఓటింగ్ కంపార్ట్మెంట్ గోప్యత నిర్వహణ సక్రమంగా చేయాలని తెలిపారు. ఇతరులకు బదులుగా ఓటు వేయడం, ఒకటికి మించి ఓటు వేయడం జరుగకుండా అన్ని జాగ్రత్తలు పాటించాలని, పోలింగ్ ముగిసిన తరువాత తీసుకోవలసిన జాగ్రత్తలు, పాటించవలసిన నియమాలపై శిక్షణలో తెలియజేయడం జరుగుతుందని తెలిపారు. పోలింగ్ అధికారులకు కేంద్రాలలో త్రాగునీరు, మూత్రశాలలు, లైటింగ్, ఫ్యాన్ వంటి అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. పోలింగ్ రోజున ఓటింగ్ సంబంధిత ప్రతి నమూనాను పూర్తిగా నింపాలని, పోలింగ్ నిర్వహణ ప్రక్రియలో పొరపాట్లకు తావు లేకుండా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ప్రతి ఒక్కరూ పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని తెలిపారు. 11వ తేదీన పోలింగ్ నిర్వహించడం జరుగుతుందని, 12 రీపోలింగ్ (ఏమైనా ఉన్నట్లయితే), 13వ తేదీన ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికలలో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కు తప్పనిసరిగా వినియోగించుకోవాలని, అర్హత గల ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నిర్మల్ ప్రగతి పథంలో అభిలాష అడుగులు

(మొదటిపేజీ తరువాయి)

## జల సంరక్షణలో జాతీయ రికార్డు..

జల సంరక్షణలో నిర్మల్ జిల్లా దేశానికే ఆదర్శంగా నిలిచింది. 'జల్ సంచయ్ – జన్ భగీదారి' చొరవ కింద దేశవ్యాప్త కేటగిరీ 2లో జిల్లా ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. కేంద్ర మంత్రి సి.ఆర్. పాటిల్ చేతుల మీదుగా రూ. 1 కోటి రివార్డును అందుకోవడం జిల్లా పాలనాయంత్రాంగం యొక్క పట్టుదలకు నిదర్శనం. నీటి సంరక్షణపై ప్రజలను భాగస్వామ్యం చేయడం ఈ విజయానికి ప్రధాన కారణం.

## జాతీయ స్థాయిలో పెంబి బ్లాక్‌కు నాలుగో ర్యాంకు..

## గవర్నర్ చేతుల మీదుగా అవార్డు

నీతి ఆయోగ్ ఎంపిక చేసిన 500 అభిలాష బ్లాక్‌లలో నిర్మల్ జిల్లా పెంబి బ్లాక్ దేశస్థాయిలో నాలుగో స్థానం సాధించి జాతీయ బ్రాంజ్ మెడల్ కైవసం చేసుకుంది. ఆరోగ్య, విద్య, వ్యవసాయ రంగాల్లో చూపిన ప్రతిభకు గాను హైదరాబాద్‌లో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ విజయం జిల్లా కలెక్టర్ కృషి ఫలితం.

## వారసత్వానికి ప్రాణం నిర్మల్ ఉత్సవాలు..

చరిత్ర ప్రసిద్ధి గాంచిన నిర్మల్ హస్తకళలు, చెక్క బొమ్మల వైభవాన్ని ప్రపంచానికి చాటేందుకు 'నిర్మల్ ఉత్సవాలు' వేదికగా నిలిచాయి. జిల్లా సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడటంతో పాటు స్థానిక కళాకారులకు ప్రోత్సాహం అందించడంలో కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ చూపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, డ్రగ్స్ వ్యతిరేక పోరాటం, బాలికా సాధికారత వంటి అంశాల్లోనూ కలెక్టర్ తన మార్కును చాటుకుంటున్నారు. సోషల్ మీడియా ద్వారా ప్రజలకు చేరువగా ఉంటూ, సమస్యలపై తక్షణమే స్పందించే ఆమె పనితీరు పట్ల జిల్లా ప్రజల్లో సానుకూలత వ్యక్తమవుతోంది. ఒక యువ అధికారిణి నాయకత్వంలో నిర్మల్ జిల్లా అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది.

# ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా సమన్వయంతో కృషి చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

20 వార్డులు, కాగజ్‌నగర్ పరిధిలోని 30 వార్డులకు ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల నిర్వహణ కొరకు అధికారులు, సిబ్బందిని నియమించడం జరిగిందని, పోస్టల్ బ్యాలెట్ ద్వారా విధులు నిర్వహిస్తున్న ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు తప్పనిసరిగా వినియోగించుకోవాలని తెలిపారు. ఈనెల 11వ తేదీన పోలింగ్, 13వ తేదీన ఓట్ల లెక్కింపు జరుగుతుందని, ఈ క్రమంలో విధులు కేటాయించబడిన అధికారులు తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని, జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 60 స్థానాల్లో విజయం ఖాయం.. కార్పొరేషన్‌పై ఎగిరేది కాంగ్రెస్ జెండా: కొక్కిరాల సురేఖ



**- 33వ డివిజన్‌లో అభ్యర్థి ఎంబడి కుమారస్వామి తరపున ముమ్మర ప్రచారం**

నస్పూర్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త

మంచిర్యాల కార్పొరేషన్‌లోని మొత్తం 60 స్థానాలను భారీ మెజారిటీతో గెలిచి కార్పొరేషన్ పై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని జిల్లా మాజీ డిసిసి అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ అన్నారు. ఆదివారం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 33వ డివిజన్‌లో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎంబడి కుమారస్వామిని చేయి గుర్తుపై ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని స్థానిక ప్రజలను కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉందని గుర్తు చేశారు. స్థానిక ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు నేతృత్వంలోనే మంచిర్యాల కార్పొరేషన్ అభివృద్ధి సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నస్పూర్ ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదని కొక్కిరాల సురేఖ ఆరోపించారు. గత ప్రభుత్వ వైఫల్యాల వల్ల స్థానిక ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారని విమర్శించారు. మంచిర్యాల పట్టణంతో సమానంగా నస్పూర్ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తామని వివరించారు. ప్రజా మద్దతుతో కాంగ్రెస్ క్లీన్ స్వీప్ చేస్తుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు. ఇంటింటి ప్రచారంలో భాగంగా ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎంబడి కుమారస్వామి గెలుపుతోనే డివిజన్ సమస్యలు పరిష్కారం అవుతాయని ఓటర్లకు వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# డివిజన్ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తా: దొమ్మటి కవిత

**- 35వ డివిజన్‌లో ముమ్మర ప్రచారం.. సింగరేణి ఉద్యోగులకు ఉచిత ఐటీ ఫైలింగ్ హామీ**



ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహిస్తున్న దొమ్మటి కవిత-రాజేందర్

నస్పూర్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త

35వ డివిజన్ అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు నిరంతరం కృషి చేస్తానని దొమ్మటి కవిత–రాజేందర్ పేర్కొన్నారు. ఆదివారం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 35వ డివిజన్‌లో ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అభ్యర్థిగా ఎన్నికల బరిలో ఉన్న ఆమె ఓటర్లను కలిసి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డివిజన్ సర్వతోముఖాభివృద్ధికి తనను గెలిపించాలని కోరారు. మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా తనను కార్పొరేటర్‌గా గెలిపిస్తే డివిజన్ పరిధిలోని సింగరేణి ఉద్యోగులకు ఒక ప్రత్యేక హామీ ఇచ్చారు. సింగరేణి కార్మికులందరికీ ఉచితంగా ఐటీ రిటర్న్స్ ఫైలింగ్ చేయిస్తానని స్పష్టం చేశారు. డివిజన్ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సేవ చేస్తానని వివరించారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మద్దతుతో తాను 35వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు దొమ్మటి కవిత వెల్లడించారు. సింహం గుర్తుపై ఓటు వేసి భారీ మెజార్టీతో విజయం చేకూర్చాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, సింహం గుర్తుకే తమ మద్దతు ఉంటుందని ఓటర్లు హామీ ఇస్తున్నారని దొమ్మటి కవిత ధీమా వ్యక్తం చేశారు. ప్రజా మద్దతుతో తన విజయం ఖాయమని వెల్లడించారు. ప్రచారంలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లినప్పుడు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


# మంచిర్యాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

**- మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ - 9వ డివిజన్‌లో అభ్యర్థి సురిమిల్ల సౌమ్య తరపున కార్నర్ మీటింగ్**

నస్పూర్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త

మంచిర్యాల కార్పొరేషన్‌లో 60 మంది కాంగ్రెస్ అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలిచి, కార్పొరేషన్‌పై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని జిల్లా కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు తనయుడు కొక్కిరాల చరణ్ రావు ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వినాయక టౌన్‌షిప్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో భాగంగా వారు 9వ డివిజన్ కార్నర్ మీటింగ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా 9వ డివిజన్ కాంగ్రెస్ అభ్యర్థి సురిమిల్ల సౌమ్య -వేణును చేతి గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నారని పేర్కొన్నారు. 9వ డివిజన్‌లో అవసరమైన అన్ని మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ, ప్రేమ్ సాగర్ రావు నేతృత్వంలోనే మంచిర్యాల సమగ్ర అభివృద్ధి సాధ్యమని వారు స్పష్టం చేశారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత వందల కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు వెల్లడించారు. నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే నెంబర్ వన్‌గా నిలపడానికి ఎమ్మెల్యే కష్టపడుతున్నారని తెలిపారు. ప్రత్యేక ప్రణాళికతో నియోజకవర్గ రూపురేఖలు మారుస్తున్నట్లు వివరించారు. డివిజన్ సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని ఓటర్లకు భరోసా ఇచ్చారు. అభివృద్ధి పనుల పట్ల ప్రజలు సానుకూలంగా ఉన్నారని, భారీ మెజార్టీతో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని నేతలు ధీమా వ్యక్తం చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళా ప్రతినిధులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


వినాయక టౌన్ షిప్‌లో కాంగ్రెస్ అభ్యర్థి తరపున ప్రచారం నిర్వహిస్తున్న కొక్కిరాల సురేఖ



## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా: గడ్డం సంపత్ గౌడ్

రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని క్యాతనపల్లి మున్సిపాలిటీ 11వ వార్డు మాజీ కౌన్సిలర్, బిజెపి బలపరిచిన కౌన్సిలర్ అభ్యర్థి గడ్డం సంపత్ గౌడ్ అన్నారు. మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం శివాజీ నగర్ ఏరియాలో ఇంటింటికి తిరుగుతూ ప్రచారం చేశారు. భారతీయ జనతా పార్టీ మున్సిపాలిటీలో అన్ని వార్డుల్లో పోటీ చేస్తుందని కౌన్సిలర్ అభ్యర్థులను అందరూ అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. మున్సిపాలిటీ అభివృద్ధి చెందాలంటే బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. వార్డ్‌లో రోడ్లు, డ్రైనేజీలు, మౌలిక వసతుల కల్పనకు హామీ ఇచ్చారు.



## జన్నారం గ్రామంలో పోచమ్మ బోనాలు

జన్నారం, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త

గౌడ కులస్తులు ప్రతిష్టాత్మకంగా నిర్వహించే పోచమ్మ బోనాలు జన్నారం గ్రామంలో ఆదివారం రోజు ఘనంగా నిర్వహించారు. గౌడ కులస్తుల నిర్వహిస్తున్న ఎల్లమ్మ బోనాల్లో భాగంగా ప్రతి ఇంటికి ఒకరు బోనాలు నెత్తిన పెట్టుకుని జన్నారం గ్రామంలోని ఎల్లమ్మ గుడి సమీపంలో ఉన్న పోచమ్మ ఆలయంలో అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే ఎల్లమ్మ బోనాలు మంగళవారం నాడు నిర్వహిస్తామని జన్నారం గౌడ సంఘం అధ్యక్షులు పోతుగంటి రాజేశం గౌడ్ తెలిపారు.

## ఎన్‌పీఎల్ విజేత సింగరేణి రాయల్ వారియర్స్ జట్టు

నస్పూర్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త

నస్పూర్ ప్రీమియర్ లీగ్ (ఎన్‌పీఎల్) సీజన్1 క్రికెట్ పోటీల్లో సింగరేణి రాయల్ వారియర్స్ జట్టు విజయం సాధించింది. నస్పూర్‌లోని న్యూ నాగార్జునకాలనీ సింగరేణి ప్రాణహిత స్టేడియంలో ఈనెల 1న ఈ పోటీలు ప్రారంభం కాగా, ఆదివారం జరిగిన ఫైనల్ పోరుతో సీజన్1 ముగిసింది. లీగ్ దశ నుండి అత్యంత ప్రతిభా కనబర్చి ఎలిఫెంట్ జట్టు, సింగరేణి రాయల్ వారియర్స్ జట్టు ఫైనల్‌కు చేరుకున్నాయి. ఆదివారం సాయంత్రం జరిగిన ఫైనల్ పోటీ హోరా హోరీగా జరిగింది. టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్న సింగరేణి రాయల్ వారియర్స్ జట్టు ఎలిఫెంట్ జట్టును నిర్దేశిత ఓవర్లలో 99 పరుగులకే పరిమితం చేయగా, లక్ష్య చేధనలో బ్యాటింగ్కు దిగిన సింగరేణి వారియర్స్ జట్టు ఎక్కడ తడబడకుండా విజయతీరాలకు చేరింది. విజేతకు రూ.50 వేల నగదు, ట్రోఫీతో పాటు క్రీడాకారులకు వ్యక్తిగత షీల్డ్‌లు అందజేశారు. రన్నర్‌గా నిలిచిన ఎలిఫెంట్ జట్టుకు రూ.25 వేల నగదు, ట్రోఫీతో పాటు వ్యకిగత్త షీల్‌లు అందజేశారు. టోర్నీలో అత్యంత ప్రతిభా కనబర్చిన క్రీడాకారులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎన్పీఎల్1 ఆర్గనైజర్స్ గడ్డం సాయి, లడ్డ సాయి, ఎర్ర సంతోష్, సాగర్, జగన్, సోము, ధృవ సాయి, మంగేష్, డానియల్, వెంకటసాయి, సీనియర్ క్రీడా కారులు సంతోష్ నాయక్, కోడం రవి తదితరులు పాల్గొన్నారు.





ఎస్సై అనిల్ కుమార్‌ని సన్మానిస్తున్న కమ్మర్గం సర్పంచ్

## పెంచికల్‌పేట్ ఎస్సైకి సన్మానం

పెంచికల్‌పేట్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త :

మండలంలోని కమ్మర్గం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో శాంతి భద్రతలకు అంకితభావంతో సేవాలందిస్తున్న ఎస్సై అనిల్ కుమార్ ను ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొండ్రా సులోచన భాస్కర్ గౌడ్ పాల్గొని, శాంతి పరిరక్షణలో పోలీస్ శాఖ సేవలను ప్రశమశించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మధునయ్య, నాయకులు బాపు, తదితరులు పాల్గొన్నారు.


కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

## ఘనంగా కేశనాథ ఆలయ షష్టమ వార్షికోత్సవం

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:

ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని కేశనాథ ఆలయ షష్టమ వార్షికోత్సవంను భక్తులు ఆదివారం వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉదయం ఆలయంలో అర్చకులు నరేష్ శర్మ ఆధ్వర్యంలో ఆలయంలో పత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, స్వామికి అభిషేకం, గణపతి పూజ, పుణ్యాహవచనం అనంతరం స్వామి ఉత్సవ విగ్రహాల ఎదుర్కోలు కార్యక్రమం నిర్వహించారు. అలయు కమిటీ తరపున మసాదే అనంత్ స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించారు. మధ్యాహ్నం అర్చకులు మధూకర శర్మ, శిరీశ్ శర్మ, సాయి శర్మ, సంతోశ్ శర్మ, డిల్లీ విజయ్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో స్వామి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మహిళలు, భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. తీర్థ ప్రసాద వితరణ అనంతరం అన్నదానం చేపట్టారు. సాయంత్రం పల్లకి సేవ, రాత్రి భోజన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో వేణుగోపాల్ గుప్తా, ఆలయ కమిటీ ఆధ్యక్షులు ప్రకాష్, సభ్యులు అభయ్ కుమార్ శ్రీనివాస్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## కానిస్టేబుల్ కార్తిక్‌కు పురస్కారం

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:

తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ నిర్వహించిన జసురక్ష 100 డేస్‌చ కార్యక్రమంలో భాగంగా ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంకుచెందిన కానిస్టేబుల్ కార్తిక్ ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. హైదరాబాద్ లో జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర డిజిపి శివదర్ రెడ్డి చేతుల మీదుగా ఈ పురస్కారం అందుకున్నారు. కుమురంభీమ్ జిల్లా ఎస్పీ కార్యాలయ పీఆర్వోగా ఆయన అందిస్తున్న సేవలను గుర్తించి నగదు బహుమతిని అందజేశారు. ఈ గుర్తింపు తన బాధ్యతను మరింత పెంచిందని, భవిష్యత్తులో మరింత నిబద్ధతతో విధులను నిర్వహిస్తానని, ఈ అవకాశం కల్పించిన జిల్లా ఎస్పీ నితికా పంత్, ఇతర జిల్లా పోలీస్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.


డిజిపి చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారం అందుకుంటున్న కార్తీక్

## అడవి పంది దాడిలో రైతుకి తీవ్ర గాయాలు

పెంచికల్‌పేట్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త :

పెంచికల్‌పేట్ మండలం కొండపల్లి గ్రామానికి చెందిన రైతు డబ్బుల పోచయ్య ఆదివారం ఉదయం వ్యవసాయ పనుల నిమిత్తం తన పత్తి చేనుకు వెళ్లగా. ఈ క్రమంలో చెట్ల పొదల్లో దాగి ఉన్న అడవి పంది ఒక్కసారిగా దాడి చేయడంతో పోచయ్య తీవ్రంగా గాయపడ్డాడు. ఆకస్మిక దాడిని గమనించిన చుట్టపక్కల చేన్లలో పని చేస్తున్న రైతులు పరుగున అక్కడికి చేరుకొని అడవి పందిని తరిమేశారు. అనంతరం గాయపడిన పోచయ్యను వెంటనే ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయనకు చికిత్స కొనసాగుతుందని కుటుంబ సభ్యులు తెలిపారు. అడవిజంతువుల సంచారం పెరగడంతో రైతులు భయాందోళనకు గురవుతున్నారు. అటవీ శాఖ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.


గాయపడిన రైతు రాములు

# గిరిజన ప్రాంతాల్లో దంత వైద్య సేవలు విస్తరించాలి

● ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్, ఫిబ్రవరి 08, ప్రభాతవార్త:**

జిల్లాలోని గిరిజన ప్రాంతాల్లో దంత వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా పేర్కొన్నారు. ఆదివారం స్థానిక మంగళ మూర్తి కన్వెన్షన్ హాల్‌లో ఇండియన్ డెంటల్ అసోసియేషన్ (ఐడిఎ) 2026 నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గత కార్యవర్గం సాధించిన విజయాలను అభినందించారు. నూతన కార్యవర్గం కూడా అదే ఉత్సాహంతో ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో పొగాకు వినియోగం అధికంగా ఉండటం వల్ల నోటి క్యాన్సర్ వంటి వ్యాధులు ప్రబలుతున్నాయని, వీటిపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. “ఆరోగ్య పాఠశాల“ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో పొగాకు, మద్యం, డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఈ ప్రయత్నానికి ఐడీఏ, ఐఎంఏ వైద్యులు సహకారం అందించాలని కోరారు. ఆశ్రమ పాఠశాలల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు. జిల్లాలో మాతృ మరణాలను తగ్గించడంలో పురోగతి సాధించామని వెల్లడించారు. కార్డియో




రెస్పిరేటరీ కేసుల సమస్యల పరిష్కారానికి ఐసీయూ, ఎంఐసీయూ లను బలోపేతం చేస్తున్నామని తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులకు మెమోంటోలు ఇచ్చి శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ డి.ఎన్.స్వామి, డి. చలపతి రావు, నూతన అధ్యక్షుడు డాక్టర్ ఆర్ ఆనంద్, కార్యదర్శి డాక్టర్ చిన్మయ్ వాజే, వైద్యులు వెంకట్ రెడ్డి, సాయిరాం, రవీందర్, అమూల్య తదితరులు పాల్గొన్నారు.



## రెండో వార్డు కౌన్సిలర్ అభ్యర్థి పుల్లూరి తిరుమలను గెలిపించాలి

- మాజీ కౌన్సిలర్ పుల్లూరి సుధాకర్

**రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త**

కాంగ్రెస్ పార్టీ బలపరిచిన రెండో వార్డు కౌన్సిలర్ అభ్యర్థి పుల్లూరి తిరుమల కళ్యాణ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని రెండో వార్డు మాజీ కౌన్సిలర్ పుల్లూరి సుధాకర్ అన్నారు. ఆదివారం రెండో వార్డులో ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ప్రచారం సందర్భంగా అధికార కాంగ్రెస్ పార్టీ, మంత్రి వివేక్ వెంకటస్వామి సహకారంతో వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని స్పష్టం చేస్తూ ప్రచారం నిర్వహించారు. మున్సిపాలిటీలో వార్డును ఆదర్శప్రాయంగా తీర్చిదిద్దుతానని, ఆదరించి ఆశీర్వదించి కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు ఆసరా పింఛన్లు రేషన్ కార్డులు ఇప్పించేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు.

## పొనకల్ గ్రామ పంచాయతీలో నేడు గ్రామ సభ

**జన్నారం, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త**

జన్నారం మండల కేంద్రంలోని పొనకల్ మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం నాడు ఉదయం 11 గంటలకు గ్రామ సభ నిర్వహిస్తున్నామని గ్రామ సర్పంచ్ జక్కు సుష్మ భూమేష్, ఈవో రాహుల్ వెల్లడించారు. ఈ గ్రామ సభలో నీటి ఎద్దడి నివారణ, అలాగే రానున్న వేసవి కాలం నేపథ్యంలో గ్రామంలో ఎలాంటి సమస్యలు ఏర్పడకుండా ముందస్తు కార్యక్రమంలో భాగంగా గ్రామ సభ నిర్వహిస్తున్నామని తెలిపారు.

## వివాహిత ఆత్మహత్య

**చింతలమానేపల్లి, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:**

మండలంలోని రవీంద్రనగర్2 గ్రామానికి చెందిన సుచిత్ర రాయ్(27) అనే వివాహిత క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకుంది.ఎస్ఐ ఇస్లావత్ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్‌లో ఉంటున్న తన చెల్లెలికి పాప పుట్టడంతో, ఆమెను చూసేందుకు వెళ్దామని తన భర్త పరేష్ రాయ్‌ను కోరగ మంగళవారం క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ ఉందని, బుధవారం వెళ్దామని భర్త చెప్పాడు.దీంతో మనస్తాపానికి గురైన సుచిత్ర, క్షణికావేశంలో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగ చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## శెట్‌పల్లి గ్రామంలో రైతుల ఆందోళన

**జైపూర్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త**

163 వ జాతీయ రహదారి పనుల నిర్వహించేందుకు మెగా కంపెని మండలం లోని శెట్ పల్లి గ్రామ రైతులతో చేసుకున్న లీజ్ ఒప్పందానికి విరుద్ధంగా పనులు చేపడుతుందని రైతులు ఆదివారం మెగా కంపెనీపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ రైతుల ఆందోళన నిర్వహించారు. లీజు ఒప్పందం ప్రకారం తమకు రావాల్సిన బకాయి డబ్బులు చెల్లించకుండా వ్యవసాయ భూమిని మొత్తం ధ్వంసం చేసి ఇష్టారీతిన నిర్మాణాలు చేపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ భూమి తమకు అందజేయాలని లేదంటే పోలీసులకు ఫిర్యాదు చేస్తామని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని రైతులు రైతులు హెచ్చరించారు.



## అభివృద్ధి చేస్తా అందుబాటులో ఉంటా: బొమ్మ భూమయ్య

**రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త**

కారు గుర్తుపై ఓటు వేసి గెలిపిస్తే అందుబాటులో ఉంటూ అభివృద్ధి చేస్తానని, 11వ వార్డు అభ్యర్థి బొమ్మ భూమయ్య అన్నారు. బిఆర్ఎస్, సిపిఐ పార్టీలు బలపరిచిన బిఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థి బొమ్మ భూమయ్య గౌడ్ మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శివాజీ నగర్ ఏరియాలో ప్రచారం నిర్వహించారు. ఒక్క అవకాశం ఇచ్చి కౌన్సిలర్‌గా గెలిపిస్తే వార్డు లోని సమస్యలను పరిష్కరిస్తానని గడపగడపకు తిరుగుతూ ఓటర్లను ఓటు అభ్యర్థిస్తూ ప్రచారం నిర్వహించారు.ఈ ప్రచార కార్యక్రమంలో కార్యకర్తలు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.





ఇందిరమ్మ ఇల్లు స్లాబ్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న సర్పంచ్, నాయకులు

## ఇందిరమ్మ ఇల్లు నిర్మాణ పనులు పరిశీలన

**తాండూర్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త :**

మండలంలోని కొత్తపల్లి గ్రామానికి ముదిగిరి అశోక్ అనిత లబ్ధిదారుల ఇందిరమ్మ ఇల్లు నిర్మాణ పనులను ఆదివారం సర్పంచ్ ఆకుల వెంకటేశం పరిశీలించారు. ఈ సందర్భంగా స్లాబ్ నిర్మాణ పనులకు సర్పంచ్ పూజ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు సూరం రవీందర్ రెడ్డి, ఇందిరమ్మ కమిటీ చైర్మన్ కట్కల మల్లేష్, యూత్ కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు పుట్ట శ్రీనివాస్, నాయకులు చీకటి వెంకటేష్ గౌడ్, మొండయ్య, చిర్రం రాజేష్ , రాజ్ కుమార్, చిర్రం మహేష్, తదితరులు పాల్గొన్నారు.



## సీతారామచంద్రస్వామి ఆలయ రజతోత్సవ వేడుకల్లో పాల్గొన్న కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్, ఫిబ్రవరి 08, ప్రభాతవార్త:**

స్థానిక తిర్పెల్లిలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన రజతోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ రాజర్షి షా పాల్గొన్నారు. ఆదివారం ఆలయాన్ని సందర్శించిన ఆయన, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన కలెక్టరుకు అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలోని సీతారామ లక్ష్మణులకు ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వేద పండితులు కలెక్టరుకు ఆశీర్వచనాలు అందించి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సంతోష్, జోషి, అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## పెద్దమ్మ తల్లికి భోనాల సమర్పణ

**సారంగాపూర్, ఫిబ్రవరి 08, ప్రభాతవార్త:**



మండలంలోని కౌట్ల (బి) గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. ఆలయ పరిసరాల్లో అమ్మవారికి మొక్కులు చెల్లించి, పిండివంటలు చేసుకున్నారు. బంధుమిత్రులను ఆహ్వానించి బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూజారి లక్ష్మణ్ మాట్లాడుతూ.. అమ్మవారికి బోనాలు సమర్పించడం శుభదాయకమన్నారు. అమ్మవారు అన్నివేళలా తోడుండి శుభ కార్యక్రమాలు దిగ్విజయంగా సాగేలా చూస్తుందని తెలిపారు. ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దమ్మ కమిటీ సభ్యులు కిష్టయ్య, శంకర్, సాయందర్, నరసయ్య, లక్ష్మణ్, రాజేశ్వర్, భీమన్న, ముదిరాజ్ బంధువులు పాల్గొన్నారు.

# మౌలిక వసతుల కల్పనే లక్ష్యం: అడ్లకొండ కవిత

**- 36వ డివిజన్‌లో ఇంటింటి ప్రచారం.. సింహం గుర్తుకు ఓటేయాలని అభ్యర్థన**

నస్పూర్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త

36వ డివిజన్ సమస్యల పరిష్కారానికి, మౌలిక వసతుల కల్పనకు నిరంతరం కృషి చేస్తానని అడ్లకొండ కవిత-రవి గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 36వ డివిజన్‌లో ఆమె విస్తృతంగా పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థిగా బరిలో ఉన్న ఆమె ఇంటింటికీ తిరుగుతూ స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డివిజన్ అభివృద్ధికి తనను గెలిపించాలని ఓటర్లను కోరారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మద్దతుతో తాను 36వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు అడ్లకొండ కవిత వెల్లడించారు. సింహం గుర్తుపై ఓటు వేసి భారీ మెజార్టీతో విజయం చేకూర్చాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. డివిజన్‌లో నెలకొన్న ప్రతి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ మౌలిక సదుపాయాల మెరుగుదలకు కృషి చేస్తానని స్పష్టం చేశారు. స్థానిక ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, ప్రజా మద్దతుతో తన విజయం ఖాయమని అడ్లకొండ కవిత ధీమా వ్యక్తం చేశారు. ప్రచారంలో ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని ఆమె వివరించారు. సింహం గుర్తుకే ఓటు వేస్తామని ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



36వ డివిజన్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న అభ్యర్థి అడ్లకొండ కవిత

## అమూల్యమైన ఓటు వేసి గెలిపిస్తే సొంత మేనిఫెస్టో అమలు చేస్తా: రెడ్డమ్మ

**- గెలిచిన వెంటనే మినరల్ ప్లాంట్ ఏర్పాటు...**

**- ఆడపిల్ల జన్మిస్తే రూ. 5,016**

రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త

క్యాతనపల్లి మున్సిపాలిటీ ఎన్నికల్లో తనకు చేయూతనిచ్చి అత్యధిక మెజారిటీతో కౌన్సిలర్‌గా గెలిపిస్తే సొంత మేనిఫెస్టో అమలు చేస్తూ ప్రజా సేవ చేస్తానని 15 వ వార్డులో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి పెండ్యాల దేవేంద్ర అలియాస్ రెడ్డమ్మ అన్నారు. ఆదివారం వార్డులోని ప్రతి ఇంటికి వెళ్లి తమ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని కోరారు. మల్లిఖార్జున నగర్, సూపర్ బజార్ ఏరియాలో ప్రచారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ వెంకట్రావు ఎన్నికల ప్రచారానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు, ఇంటింటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీ, అందిస్తుందని,చేసిన అభివృద్ధి,సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. రెడ్డమ్మ అభ్యర్థిత్వాన్ని చేతి గుర్తుకు ఓటేసి అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. రెడ్డమ్మ మాట్లాడుతూ తనను గెలిపిస్తే నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ నిత్యం ప్రజా సేవ చేస్తానని అన్నారు. కౌన్సిలర్‌గా గెలిచిన వెంటనే వార్డ్‌లో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసి 5 రూపాయలకు త్రాగు నీరు అందిస్తామని అన్నారు. 15వ వార్డ్‌లో ఆడ బిడ్డ జన్మిస్తే తన పేరు పై 5,016 రూపాయలు అందిస్తానని అన్నారు. వార్డ్ ప్రజల రక్షణ కొరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తానని అన్నారు.





## అభివృద్ధి చేస్తా అందుబాటులో ఉంటా: సత్యనారాయణ

లక్షెట్టిపేట, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త

హస్తం గుర్తుపై ఓటు వేసి గెలిపిస్తే అందుబాటులో ఉంటూ అభివృద్ధి చేస్తానని, 11వ వార్డు అభ్యర్థి బిరుదుల సత్యనారాయణ అన్నారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన కౌన్సిలర్ అభ్యర్థి మున్సిపాలిటీలోని 11వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఒక్క అవకాశం ఇచ్చి కౌన్సిలర్‌గా గెలిపిస్తే వార్డు లోని సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇస్తూ గడపగడపకు తిరుగుతూ ఓటర్లను ఓటు అభ్యర్థిస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచార కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు సయ్యద్ హాజీ, సర్పంచులు లింగంపల్లి వెంకటేష్, రాందాస్, కార్యకర్తలు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## ఎరువుల కొనుగోలు కోసం యాప్‌లో బుకింగ్ చేసుకోవాలి

**- మండల వ్యవసాయ అధికారి వినయ్‌రెడ్డి**

తిర్యాని, ఫిబ్రవరి 8,ప్రభాతవార్త

మండలంలోని రైతులందరూ ఇక నుండి ఎరువుల కొనుగోలు కోసం యాప్‌లోనే ముందస్తు బుకింగ్ చేసుకోవాలని తిర్యాని మండల వ్యవసాయ అధికారి వినయ్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా పంపిణిలో పారదర్శకత పెంచేందుకు ప్రభుత్వం ఈ యాప్‌ను ప్రవేశపెట్టడం జరిగిందని ఆయన తెలిపారు. యూరియా యాప్‌లో బుకింగ్ చేసుకున్న రైతులకు తప్పనిసరిగా ఎరువులు అందించాలని ఆయన మండలంలోని డీలర్లకు సూచించారు. అలాగే డీలర్లు ఈ యాప్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. రైతులకు ఏమైనా సందేహాలు ఉంటే వ్యవసాయ విస్తరణ అధికారులను గాని వ్యవసాయ శాఖ కార్యాయలయంలో గాని సంప్రదించాలని ఆయన రైతులను కోరారు.

# క్యూలైన్లకు గుడ్‌బై.. యాప్‌తోనే ఎరువుల సరఫరా

చింతలమానేపల్లి, ఫిబ్రవరి 08, ప్రభాతవార్త:

మండలంలోని రైతులకు ఎరువుల యూరియా ఇబ్బందులు ఇప్పటి నుండి తొలుగనున్నాయి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం,రాష్ట్ర వ్యవసయశాఖ ఫెర్టిలేజర్ యాప్ ను అందుబాటులోకి తీసుకవచ్చినట్లు మండల వ్యవసాయ అధికారి కె. కార్తీష తెలిపారు. రైతులు తమ స్మార్ట్‌ఫోన్లలో ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవడంతో మండలంలో ఏ డీలర్ వద్ద ఎంత స్టాక్ ఉందో తెలుసుకోవచ్చని స్టాక్ వున్న డీలర్ ఎరువుల దుకాణంలో ఎరువుల బస్తాలను యాప్‌లోనే ముందస్తుగా బుక్ చేసుకునే సౌలభ్యం ఉందని, దీనివల్ల రైతుల సమయం ఆదా కావడంతో పాటు పారదర్శకత పెరుగుతుందని అన్నారు. ఎరువుల కోసం రైతులు ఇప్పటి నుండి ఎక్కడికీ తిరగాల్సిన అవసరం లేదని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్క రైతు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



ఆలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న వన్ నేషన్ వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్ అరిగెల నాగేశ్వరావు

## ఆధ్యాత్మికతను ప్రతీ ఒక్కరు అలవర్చుకోవాలి

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని వన్ నేషన్ వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్, భాజపా సీనియర్ నాయకులు అరిగెల నాగేశ్వరావు పేర్కొన్నారు. ఆదివారం ఆసిఫాబాద్ మండలంలోని మోతుగూడ గ్రామంలో నూతనంగా నిర్మించిన మల్లన్న ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు గోపాల్, రాజన్న, నాయకులు సతీష్ బాబు, సుహాసిని, సత్రవేణి గంగన్న, మల్లేష్, ప్రసాద్ గౌడ్, విశాల్ తదితరులు ఉన్నారు



సర్పంచ్ ముడిమడుగుల సురేష్ ను సన్మానిస్తున్న గ్రంథాలయ పార్ట్ టైం స్వీపర్ స్వామి

## గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

తాండూర్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త

విద్యార్థులు, యువత గ్రంథాలయన్ని సద్వినియోగం చేసుకోవాలని తాండూర్ సర్పంచ్ ముడిమడుగుల సురేష్ అన్నారు. మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని ఆదివారం సర్పంచ్ సందర్శించారు. గ్రంథాలయ పని వేళలు, సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్ మాట్లాడుతూ గ్రంథాలయాలు దేవాలయాలాంటివన్నారు. గ్రంథాలయాల్లో పుస్తకం పఠనం ద్వారా విజ్ఞానం పెరుగుతుందన్నారు.గ్రంథాలయం అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సర్పంచిగా ఎన్నికై మొదటిసారిగా గ్రంథాలయాన్ని సందర్శించిన సర్పంచ్ ను గ్రంథాలయ పార్ట్ టైం స్వీపర్ చెరుకుపల్లి స్వామి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో తాండూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎండి ఈసా, తదితరులు పాల్గొన్నారు.

## సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వారోత్సవాలను విజయవంతం చేయాలి

జన్నారం, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త

ఈనెల 20న నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణంలో నిర్వహిస్తున్న సంత్ సేవాలాల్ మహారాజ్ అధికారిక జయంతి వారోత్సవాలకు బంజారా గిరిజనులందరూ హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బంజారా సేవా సంఘం రాష్ట్ర నాయకులు రాజేష్ నాయక్ కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ హాజరవుతున్నారని, గిరిజన దర్బార్ నిర్వహిస్తున్నందున ఖానాపూర్ నియోజకవర్గంలోని జన్నారం మండల పరిధిలోని గిరిజన తండా లోని బంజారా గిరిజనులందరూ ఈ కార్యక్రమానికి హాజరై, తమ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు, వినతి పత్రాలు కూడా అందజేయవచ్చు అని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోహన్ నాయక్, శ్రీనివాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

